క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత అనిల్‌కుమార్‌కు విరాళం బాండ్‌ను అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు శనివారం రూ.1,00,101 విరాళంగా అందజేశారు. మంగళగిరికి చెందిన మాజేటి అనిల్‌కుమార్ ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్‌ను అందించారు.

ఘనంగా రాఖీ పారాయణ కార్యక్రమం

కొయ్యలగూడెం: గ్రామ దేవత చింతాలమ్మ ఆలయం వద్ద మార్వాడీ మహిళలు శనివారం పూజలు నిర్వహించారు. హోలీ పండుగ నేపథ్యంలో మూడు రోజుల పాటు నిత్యం అమ్మవారి ఆలయం వద్ద మహిళలు సామూహిక పారాయణలు చేస్తున్నారు. రాఖీ సంప్రదాయం మొదట రాజస్థాన్‌లో ప్రారంభమై ప్రపంచ ప్రసిద్ధి పొందిందని మహిళలు పేర్కొన్నారు. చిత్తోర్‌ఘడ్ రాణి కర్ణావతి మొగల్ చక్రవర్తి హుమయూన్‌కు రాఖీ కట్టి హైందవ సంప్రదాయాన్ని తెలిపిందన్నారు. ఈ సందర్భంగా పురాణాలను, చరిత్రను మేళవిస్తూ చేసిన పారాయణలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి.

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి నిత్య కైంకర్యాలతో పాటు, సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించినట్లు ఈవో తెలిపారు. స్వామివారిని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతిరాజు, రెడ్డి రంగప్రసాద్, వాస సాయి నగేష్ దర్శించుకున్నారు.

నూకాలమ్మ ఆలయంలో చండీహోమం

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయ యాగశాలలో పౌర్ణమి తిథిని పురస్కరించుకుని చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ యాగశాలలో తిరుపతి రమేష్, త్రిపురసుందరీ దంపతులు, సీహెచ్ వేణు, ఛాయాదేవి దంపతులు, శ్రీనివాసరావు, స్వప్న సుందరి దంపతులు, గొట్టా వెంకట పరమేశ్వరరావు, మోహిని దంపతులు, పోలా రాజేష్, సుజాత దంపతులు ఉభయధారులుగా వ్యవహరించగా, అర్చకులు శాస్త్రోక్తంగా చండీహోమం నిర్వహించారు. కోలాట బృందాలు భగవాన్ నామ సంకీర్తనలతో కోలాటం నిర్వహించారు.

ఆంజనేయునికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో శనివారం అభిషేక సేవ నిర్వహించారు. శనివారం మధ్యాహ్నానికి ఆలయానికి పలు సేవల రూపేణ రూ.1,03,018 ఆదాయం సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమాల ఏర్పాట్లను జువ్వాది కృష్ణ , కురగంటి రంగారావు పర్యవేక్షించారు.

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు



ఎళ్లి జనాలతో నిండిన అనివేటి మండపాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలి వచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు కళకళలాడాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణ కట్ట ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. వకుళమాత నిత్యాన్నదాన భవ నం వద్ద ఉచిత అన్నప్రసాదం కోసం భక్తులు బారులు తీరారు.

చినవెంకన్న క్షేత్రంలో పెళ్లి సందడి

ఫాల్గుణ మాసంలో మంచి ముహూర్తం కావడంతో శనివారం చినవెంకన్న క్షేత్రంలో పలు జంటలు మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యా యి. ఆలయ అనివేటి మండపం, పాదుకా మండపం వద్ద ఉన్న స్వామివారి కల్యాణ మండప ప్రాంతం, అలాగే కొండపైన, కొండ దిగువనున్న దేవస్థానం, ప్రైవేటు సత్రాలు, కల్యాణ మండపాలు వివాహాలకు వేదికలయ్యాయి. అనంతరం కొత్త జంటలు, వారి బంధుమిత్రులు శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్నారు.

పెద్దాసుపత్రి నిర్మాణానికి సుస్తీ

- నత్త నడకన నూరు పడకల ఆసుపత్రి నిర్మాణం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.23 కోట్లు మంజూరు
- ఆసుపత్రి నిర్మాణం వైపు కన్నెత్తి చూడని కూటమి సర్కారు



నత్త నడకన సాగుతున్న నూరు పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు

చింతలపూడి: మెట్ట ప్రాంత వాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పదిహేనేళ్ల నాటి కల ఇప్పట్లో నెరవేరేలా లేదు. చింతలపూడి నియోజకవర్గ కేంద్రంలో నిర్మాణం చేపట్టిన 100 పడకల ఆసుపత్రి పనులు నత్తనడకన సాగుతుండటమే దీనికి కారణం. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చింతలపూడికి నూరు పడకల ఆసుపత్రిని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసి రూ.23 కోట్ల నిధులను కేటాయించారు. 2020 నవంబర్ 19న ఆసుపత్రి ప్రధాన భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. 95,000 చదరపు అడుగుల వైశాల్యంలో ఆసుపత్రి భవనాలను నిర్మించడానికి నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి బాధ్యతలు అప్పగించారు. గత ప్రభుత్వ హయాంలో శరవేగంగా చేసిన ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రస్తుతం ముందుకు సాగడం లేదు.

2011లోనే మంజూరు

2011లో నియోజకవర్గ కేంద్రమైన చింతలపూడిలో వంద పడకల ఆసుపత్రిని ఆనాటి ముఖ్యమంత్రి ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేశారు. అప్పట్లో రూ.5.44 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. 2012 సెప్టెంబర్ 30న అప్పటి ఎమ్మెల్యే మద్దాల రాజేష్‌కుమార్ ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం 2013 డిసెంబర్ 17న అప్పటి కేంద్ర మంత్రి కావూరు సాంబశివరావు శంకుస్థాపన చేశారు. అయితే ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. గత టీడీపీ హయాంలో నూరు పడకల ఆసుపత్రి విషయాన్ని పక్కన పెట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.23 కోట్లు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఆసుపత్రి నిర్మాణం వైపు కన్నెత్తి చూడడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. చింతలపూడిలో ఉన్న 30 పడకల ఆసుపత్రికి లింగపాలెం, కామవరపుకోట, టి.నర్సాపురం, చింతలపూడి మండలాల నుంచి, కృష్ణా, ఖమ్మం జిల్లాల నుంచి నిత్యం 300 నుంచి 400 మంది రోగులు ఈ ఆసుపత్రికి వైద్యం నిమిత్తం వస్తుంటారు. కొన్ని సంవత్సరాలుగా వైద్యుల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ నూరు పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే వైద్యపరంగా ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందనడంలో సందేహం లేదు.

త్వరగా పూర్తి చేయాలి



నియోజకవర్గ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నూరు పడకల ఆసుపత్రిని త్వరగా పూర్తి చేయాలి. వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యింది. సరైన వైద్య సదుపాయాలు లేక రోగులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది.

–బొడ్డు వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు

వైద్య సేవలు కరువు



మెట్ట ప్రాంతంలో సరైన వైద్య సౌకర్యాలు లేవు. దీంతో పేద రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి ప్రభుత్వ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకు రావాలి. ఈ మేరకు ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

–డి.రామరాజు నాయక్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకుడు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. కొయ్యలగూడెంలో మూడు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. శనివారం నిర్వహించిన పరీక్షకు మొత్తం 377 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 346 హాజరయ్యారన్నారు. 31 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో 14వ తేదీ అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. మిద్దె శ్రీను ఇంటిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించిందని సర్పంచ్ ఎల్‌ఏ లక్ష్మి తెలిపారు. దీంతో కుటుంబం సర్వం కోల్పోయి నష్టపోయారన్నారు. బాధితులను రెవెన్యూ అధికారులతో కలిసి ఆమె పరామర్శించారు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి



కారల్ మార్క్స్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నేతలు

చింతలపూడి: కమ్యూనిజం సిద్ధాంత రూపకర్త కారల్ మార్క్స్ 142వ వర్ధంతిని ప్రజాసంఘాల కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు. ముందుగా కారల్ మార్క్స్ చిత్రపటానికి సీపీఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు, నాయకులు రామిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అశోక్, పి.సర్వేశ్వరరావు, ఆర్.ధర్మారావు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రను నిర్మిద్దాం



జంగారెడ్డిగూడెం: ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు



కొయ్యలగూడెం: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు మానుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తినలక్ష్మి అన్నారు. మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు నంబూరు రామచంద్రరాజు, వలవల తాతాజీ, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు, వైసీపీ నాయకులు బత్తిన చిన్న, పట్టణ ప్రముఖులు రావూరి కృష్ణ, షేక్ ముస్తఫా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయం కార్యదర్శులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ భారత్ తద్వారా స్వచ్ఛ మండలంగా కొయ్యలగూడేన్ని తీర్చిదిద్దుదామంటూ ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పరింపూడి పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి కె.సురేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సర్పంచ్ ముప్పిడి విజయకుమారితో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

పోలవరం రూరల్: సామాజిక ఆరోగ్య కేంద్రం పరిసరాలు, వార్డుల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూపరింటెండెంట్ రాంబాబు సిబ్బందికి సూచించారు. పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ హైస్కూల్‌లలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని హెచ్‌ఎం పి.సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులు పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. అదే విధంగా శ్రీవారి క్షేత్రంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జేవీ సుబ్బారావు, ఎంపీడీవో టీవీ ప్రకాష్, ఉపాధ్యాయులు శారద, మస్తాన్ బిబి, పద్మమహాలక్ష్మి, సీతామహాలక్ష్మి, మల్లయ్య, రమేష్, కుమారస్వామి, ప్రభాకర్, రాంబాబు, ఉషాదేవి, జయలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో భాగస్వాములు కావాలి

లింగపాలెం: స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈవోపీఆర్‌డీ జేవీ రత్నకుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో కలిసి ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



పోలవరం రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది



లింగపాలెం: కరపత్రాలు అందజేస్తున్న ఈవోపీఆర్డీ రత్నకుమార్



ద్వారకాతిరుమల: ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

కొయ్యలగూడెం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నట్లు ఎంఈఓ జె.సురేష్‌బాబు శనివారం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. కొయ్యలగూడెం మండలంలో 977 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, కొయ్యలగూడెం, పరింపూడి, కన్నాపురం, బయ్యనగూడెం మొత్తం నాలుగు కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. నలుగురు చొప్పున ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, 48 మంది ఇన్విజిలేటర్లు పరీక్షలను పర్యవేక్షిస్తారన్నారు. కొయ్యలగూడెం బాయ్స్ హైస్కూల్‌లో 240, పరింపూడి బాలికల హైస్కూల్‌లో 249, కన్నాపురం జెడ్పీ హైస్కూల్‌లో 194, బయన్నగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 294 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

రామాలయ పునఃప్రతిష్ఠ ప్రారంభం



కోదండ రామాలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్న పండితులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రామచంద్రపురంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయ పునః ప్రతిష్ఠ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. గణపతిపూజ, అంకురారోపణ, దీక్షాధారణ, వాస్తుహోమం, కలశస్థాపన, జలాధివాసం, క్షీరాధివాసం, బలిహరణ, మంటపారాధనలు, యాగశాల ప్రవేశం, అగ్నిమథనం, దేవతా హోమాలు, చతుర్వేద స్వస్తి తదితర పూజా కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. వాస్తు విద్వాన్ పండిట్ చావా రమేష్‌బాబు, బ్రహ్మశ్రీ గరిమెళ్ల ప్రభాకరశాస్త్రి, బ్రహ్మశ్రీ తంగిరాల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులు పరిమి ధర్మరాజు, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్, అధ్యక్షులు మోతుకూరి నారాయణరావు, వరికూటి ధర్మారావు, పువ్వాడ విజయ రవీంద్రబాబు, మానికల బ్రహ్మానందరావు తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా దుర్గమ్మ తిరునాళ్ల

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో నిర్వహిస్తున్న కనకదుర్గమ్మ ఉత్సవాలు శనివారం రెండో రోజుకు చేరుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో విద్యుత్ అలంకరణలు చేశారు. శివపార్వతులు, కనకదుర్గమ్మ అమ్మవార్లతో పాటు పలు దేవతామూర్తులను రంగు రంగుల ఎల్‌ఈడీ లైట్లతో ఏర్పాటు చేశారు. అలాగే జెయింట్‌వీల్, రంగులరాట్నం, పలు రకాల దుకాణాల వద్ద చిన్నారులు సందడి చేశారు.

నాటు సారా నిర్మూలనకు సహకరించాలి



మొక్కను నాటుతున్న ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ అధికారులు



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సీఐ శ్రీనుబాబు

ద్వారకాతిరుమల: గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ అవులయ్య కోరారు. ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీలత ఆదేశాల మేరకు మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో శనివారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. అవులయ్య మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాలతో జీవనం సాగించేవారు ఆ పనులను మానుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ పెద్దలు, ప్రభుత్వ అధికారుల సమక్షంలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్లు పాండురంగారావు, అజయ్ కుమార్ సింగ్, తహసీల్దార్ జేవీ సుబ్బారావు, భీమడోలు సీఐ యుజే విల్సన్, ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, పి.నరసింహమూర్తి, డి.నరసింహమూర్తి, డ్వాక్రా మహిళలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథం ప్రారంభం

జంగారెడ్డిగూడెం: గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. శనివారం నవోదయం 2.0 ప్రచార రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ నాటు సారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కోసం ప్రచార రథాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎస్సైలు పాల్గొన్నారు.

పీసా చట్టంపై అవగాహన తప్పనిసరి



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

పోలవరం రూరల్: పీసా చట్టంపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని పరిశీలకులు పద్మజ అన్నారు. పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద పీసా చట్టంపై శిక్షణా తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగిరాజు, ఎంపీడీవో కె.శ్రీనివాసులు పాల్గొని చట్టంపై అవగాహన కల్పించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వార్డు సభ్యులు వెలుగు కార్యాలయం సిబ్బంది స్వయం సహాయ సంఘం మహిళా లీడర్లు, పీసా చట్టం సభ్యులు శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



చింతలపూడి: ఏఈ సుందర్రావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు



జంగారెడ్డిగూడెం: ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

చింతలపూడి: సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం తక్షణం గుంతలు పూడ్చాలని సీపీఐ చింతలపూడి పట్టణ కమిటీ శనివారం డిమాండ్ చేసింది. ఈ మేరకు రోడ్లు, భవనాలశాఖ ఏఈ సుందర్రావుకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. చింతలపూడి పట్టణంలోని గురుభట్ల గూడెం రోడ్డులో ఎక్కడ గుంతలు అక్కడే ఉన్నాయని, అదే విధంగా బైపాస్ రోడ్, చింతలపూడి నుంచి సుప్రీం పేట, పాత చింతలపూడి, నాగిరెడ్డిగూడెం వెళ్ళే రహదారులు ఎక్కడ గుంతలు అక్కడే ఉన్నాయన్నారు. వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో తోర్లపాటి బాబు, ఎస్‌కే కాలేషా, తాడిగడప మాణిక్యాలరావు, మోర్తా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం: ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణరాజు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామంలో మూడు సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. అదే విధంగా ఇల్లు నిర్మించుకొనుటకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుంచె వసంతరావు, గొలిమే బాలయేసు, కలపాల శ్రీరాములు, చందా త్రిమూర్తులు, తాళ్లూరి నాగరాజు, బొడెద్దు భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.